'కుష్టు'పై జాగ్రత్తగా ఉండాలి



మార్కండేయనగర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరుణ

మైలార్‌దేవ్‌పల్లి: కుష్టు వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ అరుణ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ కాలనీలో బుధవారం ఇంటింటికీ తిరుగుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనుమానితులను గుర్తించి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. ముఖం నూనెగా మారడం, చెవి మందంగా మారడం, చర్మంపై స్పర్శలేని మచ్చలు ఏర్పడడం, కళ్లు సరిగా మూయకపోవడం, కాళ్ల చెప్పులు జారిపోవడం, అరికాళ్లలో నొప్పి లేని పుండ్లు ఇవన్నీ వ్యాధి లక్షణాలు అని, ఏవైనా కనిపిస్తే దగ్గర్లోని ప్రభుత్వ దవాఖానలో చూపించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎంవో సులోచన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడే 'బండ్లగూడ' బల నిరూపణ



కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్



మేయర్ మహేందర్‌గౌడ్

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస సభ

బల్దియా కార్యాలయంలో ఏర్పాట్లు చేసిన అధికారులు



బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై గురువారం బల నిరూపణ జరగనున్నది. గత జనవరి 12 వ తేదీన కార్పొరేషన్ పరిధిలోని 16 మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ కలెక్టర్‌కు లేఖ అందించారు. దీంతో కలెక్టర్, అధికారులు కార్పొరేటర్ల సంతకాలు, తదితర వాటిని పరిశీలించి సరైనవిగా ధ్రువీకరించిన కలెక్టర్ ఫిబ్రవరి 16వ తేదీన బలనిరూపణ సమావేశాన్ని నిర్వహించాలని గతంలో ఆదేశాలు జారీ చేశారు. అయితే అవిశ్వాస తీర్మానం పెట్టిన నెలరోజుల్లోపే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా 33 రోజులు సమయం పట్టింది. దీంతో మేయర్ ఇదే ఛాన్స్‌గా భావించి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోగా అధికారులు అర్ధంతరంగా అవిశ్వాస సభను తాత్కాలికంగా నిలిపేశారు. అనంతరం మళ్లీ ఆ కార్పొరేటర్లే అవిశ్వాస తీర్మానం పెడుతూ మరోసారి కలెక్టర్‌కు పత్రాలను అందజేశారు. వారి సంతకాలను సరైనవిగా గుర్తించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మాణాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బలనిరూపణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు.

లతాప్రేమ్‌గౌడ్‌కు అవకాశాలు ఎక్కువ..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన 16 మంది కార్పొరేటర్లు లతాప్రేమ్‌గౌడ్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆమెను మేయర్‌గా ఎన్నుకునేందుకు ఇప్పటికే వారిని క్యాంప్‌కు తీసుకువెళ్లారు. మొదటిసారిగా మేయర్‌పై అవి శ్వాసం పెట్టిన సమయంలో నెలరోజుల పాటు సభ్యులను గోవా శిబిరానికి తీసుకువెళ్లారు. అ నంతరం కొన్ని రోజులు నగర శివారు ప్రాంతంలో, తర్వాత బెంగళూర్ క్యాంప్‌లో పెట్టారు. బుధవారం జరిగే బల నిరూపణకు క్యాంప్ నుంచి కార్పొరేటర్లు నేరుగా కార్పొరేషన్ కార్యాల యానికి చేరుకోనున్నారు. లతాప్రేమ్‌గౌడ్‌ను బలనిరూపణలో ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశాం..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం నిర్వహించనున్న బల నిరూపణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. ఇప్పటికే కార్పొరేటర్లకు నోటీసులు అందజేశామని, కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని బలనిరూపణ చేసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదని, ఏదైనా ఆర్డర్ వస్తే రద్దు అవుతుందని లేకుంటే అవిశ్వాస తీర్మానం సజావుగా జరుగుతుందని ఆయన తెలిపారు.

విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ శ్రీ విజయ గణపతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 16వ డివిజన్ కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తనవంతూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఊర పిచ్చుకల దినోత్సవం



ఊర పిచ్చుకల కృత్రిమ గుళ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రపంచ ఊర పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం వారు రాజేంద్రనగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఊర పిచ్చుకల జీవన విధానంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉచితంగా కృత్రిమ పిచ్చుక గూళ్లను పంపిణీ చేశారు. కృత్రిమ పిచ్చుక గుళ్లను అమర్చే, వాటిని పరిశీలించే విధానాన్ని సమగ్రంగా వివరించి పిల్లలతో స్లోగన్స్ చెప్పించి పిచ్చుకలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ వ్యాప్తంగా 2010 నుంచి మార్చి 20న యేటా ప్రపంచ ఊర పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ అనురాధ, డాక్టర్ పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి సబితా రెడ్డి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

శంషాబాద్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించనుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ నేతల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని పదేళ్ల బీజేపీ పాలన, రాష్ట్రంలో మూడు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే సత్తా లేకపోవడంతోనే ఎన్నికల కుట్రలో భాగంగా బీజేపీ ఈడీని అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ప్రజాసంక్షేమానికి వ్యతిరేకంగా కేంద్ర సర్కారు తీసుకున్న నిర్ణయాలను గత ప్రభుత్వం వ్యతిరేకించి ప్రజల పక్షాన నిలబడిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వాటిని నెరవేర్చడంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, ఆర్. గణేశ్‌గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, జెడ్పీటీసీ తన్వీ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు డి. వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు అజయ్, మేకల వెంకటేశ్, జహంగీర్, భారతమ్మ, పుష్పలత, విజయలక్ష్మి, నాయకులు మంచర్ల శ్రీనివాస్, నీరటి రాజు, మురళి, శ్రీనివాస్‌గౌడ్, జి.వై ప్రభాకర్, కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును వెంటనే తెరిపించాలి



ఆందోళనకారులతో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఆందోళనకారులు

- పలు గ్రామాల ప్రజల ఆందోళన
- ఆర్‌డీఓ, తహసీల్దార్‌కు వినతులు
- ఘటనా స్థలానికి వెళ్లిన మున్సిపల్ కమిషనర్

మణికొండ: ఏళ్లుగా ఉన్న రోడ్డును అకస్మాత్తుగా మూసి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే దానిని తెరిపించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్‌డీఓ, గండిపేట తహసీల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనివ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మున్సిపాలిటీ రాయల్ ఫంక్షన్‌హాల్ ముందు నుంచి డ్యూస్ విల్లాస్ పక్క నుంచి అనాదిగా మట్టి రోడ్డుపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రోడ్డును రూ.50 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి మార్చేందుకు మున్సిపాలిటీలో తీర్మానం సైతం చేశారు. దాంతో సదరు రోడ్డు ఉన్న భూమి తమ పట్టా భూమి అని పక్కనే ఉన్న రాధా రియాల్టీ వారు ఇటీవల రోడ్డుపై రేకులను అడ్డుపెట్టి మూసి వేశారు. దాంతో హైదర్‌షాగోట్, గంధంగూడ, బండ్లగూడ తదితర ప్రాంతాలకు చెందిన ఐటీ, ఇతర ఉద్యోగులు టిప్పుఖాన్‌పూల్ నుంచి తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయమై నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అనాదిగా రోడ్డును వాడుతున్నామని ప్రజలు ఆందోళన చేపట్టారన్నారు. అది గతంలో పానాది, బండ్లబాట రూపంలో రోడ్డు ఉందని, దాన్ని అకస్మాత్తుగా మూసేశారని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు లేఖ రాసి రోడ్డు ప్రభుత్వ భూమిలో ఉందా, పట్టా భూమిలో ఉందా అనే విషయాన్ని తేల్చాలని కోరుతామన్నారు. అలాగే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మణికొండ: బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ నాయకులు బుధవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు రాఘవరెడ్డి, జె.సిద్ధప్ప, రాజేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల సెక్షన్ ఆఫీసర్ల నియామకం

రాజేంద్రనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్‌లోని 535 పోలింగ్ కేంద్రాలకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ డివిజన్ ఏఆర్‌ఓ, ఆర్‌డీఓ కె.వెంకట్ రెడ్డి 49 మంది సెక్షన్ ఆఫీసర్లను నియమించారు. వీరు ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి సెక్షన్ ఆఫీసర్లకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర విషయాలను వారికి వివరించారు.

చైర్మన్లను సన్మానించిన నాయకులు



నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: కార్పొరేషన్ల చైర్మన్‌గా నియామితులైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్, బుద్వేల్ పార్టీ అధ్యక్షుడు కోరని శ్యాం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, బాలు, నరేందర్ పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

శేరిలింగంపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు. శేరిలింగంపల్లి తారానగర్‌లో ఇటీవల సీల్ వేసిన చౌకధరల (346) దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. సీజ్ చేసిన దుకాణాన్ని తనిఖీ చేయగా నిల్వల్లో భారీగా తేడాలు ఉన్నట్లు గుర్తించామని, సుమారు 90 క్వింటాళ్ళ పైగా బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు వెల్లడైందని వివరించారు. డీలర్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడువు తీరిన తినుబండారాల విక్రయం



ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్న గడువు తీరిన తినుబండారాలు

శంషాబాద్: గడువు తీరిన తినుబండారాలు విక్రయిస్తున్న దుకాణంపై శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సాతంరాయి రాయి బ్రిడ్జి సమీపంలోని కాంప్లెక్స్‌లో సైబుద్దీన్ అనే వ్యక్తి షాపు నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా కాలం చెల్లిన తినుబండారాలను అక్రమ మార్గంలో తక్కువ ధరలకు సేకరించి తన దుకాణంలో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం దాడులు చేసి మొత్తం 22 రకాల గడువుతీరిన తినుబండారాలను స్వాధీనం చేసుకుని దుకాణాన్ని సీజ్ చేశారు. వాటిలో చాకోలేట్, గోధుమ పిండి, సోయా, ధనియా, మసాలా పౌడర్లు, రైస్ ఫ్లేవర్, పానీ పూరితో తదితర వస్తువులున్నాయి. ఎస్‌ఓటీ పోలీసులు నిందితుడిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విభాసంగీత కృష్ణకుమార్‌కు ఉత్తమ రచయిత అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని విభా సంగీత కృష్ణకుమార్‌కు ఉత్తమ మాన్యుస్క్రిప్ట్‌గా2024 ఆథర్ అవార్డును గెలుచుకున్నారు. హెచ్‌సీయూలో ఐఎంఎస్‌సీ(బయాలజీ) విద్యార్థి, ఒక ప్రదర్శనకార కర్నాటక గాయకుడు. 'కౌసల్య దిక్వీన్ ఆఫ్ హార్ట్స్' అయోధ్యరాణిపై పౌరాణిక కల్పన ఉత్తమ మాన్యుస్క్రిప్ట్‌గా ఎంపిక చేయబడింది. దీనిని టైమ్స్ ఆఫ్ ఇండియా సహకారంతో జేకే పేపర్ అందించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 5వ రచయిత్రి అవార్డుల వేడుకలో ప్రముఖ నటి షర్మిలాఠాగూర్ నుంచి విభా అవార్డును స్వీకరించారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ, విద్యార్థులు అభినందించారు.

చెట్లు కొట్టివేసిన బిల్డర్‌కు జరిమానా



జరిమానా విధించిన రసీదు

మణికొండ: రోడ్డు పక్కనున్న చెట్లను కొట్టినందుకు మున్సిపాలిటీ అధికారులు ఓ బిల్డర్‌కు రూ. 20 వేల జరిమానా విధించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, రోడ్డు నంబర్ 15 ఏలో బిల్డర్ ఎం. రామారావుకు స్థలం ఉంది. అందులో భవనాన్ని నిర్మించుకునేందుకు ప్లాట్ పక్కనే అడ్డుగా ఉన్న రెండు చెట్లను కొట్టివేశాడు. ఈ విషయం తెలుసుకున్న మణికొండ మున్సిపాలిటీ అధికారులు చెట్లను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని రూ. 20 వేల ఫైన్ వేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరూ చెట్లను కొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

నాడు ఇబ్బంది.. నేడు సాఫీగా..

గతంలో విప్రో సర్కిల్‌లో ప్రధాన కూడలి మధ్యలో గద్దె (ఫైల్)



గద్దెను తొలగించడంతో సాఫీగా సాగుతున్న రాకపోకలు

రాయదుర్గం: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ప్రధాన కూడలిలో నేడు వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతోంది. ఒకప్పుడు ఈ కూడలి మధ్యలో సెంట్రల్ లైటింగ్ దాని చుట్టూరా గద్దె నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు దీని చుట్టూ ప్రయాణించాల్సి వచ్చేది. కానీ దీన్ని తొలగించి వేయడంతో ప్రస్తుతం నలు దిక్కులా వాహనదారులు సాఫీగా రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అయింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని పలు ఐటీ, ఇతర అంతర్జాతీయ సంస్థలకు వెళ్ళేందుకు ఇదే ప్రధాన కూడలి. దీనికితోడు ఔటర్ రింగురోడ్డు, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, కేశవనగర్ వంటి ప్రాంతాలకు వెళ్ళేందుకు కూడా ఇదే ప్రధాన కూడలి కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఆతర్వాత సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కూడలిలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో టీఎస్ఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో మార్గం సుగమమైంది.

త్వరలో 'మనూ'లో కమ్యూనిటీ రేడియో ప్రారంభం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో కమ్యూనిటీ రేడియో సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. యూనివర్శిటీలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా కేంద్రంలో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కమ్యూనిటీ రేడియో విద్య, సమాచార వ్యాప్తి ద్వారా సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా బుధవారం యూనివర్శిటీ క్యాంపస్‌లో ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు చేశారు. 'మనూ' క్యాంపస్ చుట్టూ 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో నివసించే నివాసితులు కమ్యూనిటీ రేడియో ప్రోగ్రామింగ్ కోసం వారి ఆలోచనలు, అంచనాలు, సమస్యలను పంచుకోవడానికి అందరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

సంతాప సభ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం మొదటి ఫైనాన్స్ ఆఫీసర్ బి నారాయణకు సిబ్బంది బుధవారం నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సంతాప సమావేశంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ సయ్యద్ మహ్మద్‌హష్మీ, మహ్మద్, డాక్టర్ ఎంఏఖుద్దూస్, సెక్షన్ ఆఫీసర్ ఆర్ శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు. అనంతరం అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

మణికొండ: బిల్డర్, ఓ కుటుంబం మధ్య తలెత్తిన వివాదంలో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు అయ్యింది. నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని వినాయకనగర్ కాలనీ ఫేజ్–2లో బిల్డర్ ఉపేందర్‌రెడ్డికి స్థలం ఉంది. అందులో నిర్మాణ వ్యర్థాలను నిల్వ చేసి తర్వాత తీసుకెళ్తుంటారు. పక్కనే ఉంటున్న ఆకుల రమేశ్, సంజన అనే భార్యాభర్తలు అక్కడ మట్టి వేయవద్దని గతంలోనే అడ్డుకోగా గొడవ జరిగింది. తర్వాత ఇరువర్గాల వారు మిన్నకుండిపోయారు. సోమవారం రాత్రి మళ్లీ మట్టి పోసేందుకు వచ్చిన ట్రాక్టర్‌ను సంజన, రమేశ్ అడ్డుకున్నారు. ట్రాక్టర్ తాళం తీసుకొని సూపర్‌వైజర్ బాలు నాయక్‌ను సంజన బూతులు తిడుతూ చెప్పుతో కొట్టడంతో వివాదం పెద్దదిగా మారింది. దీంతో బిల్డర్ తరఫున వారు వచ్చి తమ స్థలంలో మట్టి పోస్తే మీకేం అభ్యంతరమని నిలదీశారు. మాటామాటా పెరగగా బిల్డర్ తరఫు వ్యక్తి సూర్య రాడ్‌తో రమేశ్ తలపై కొట్టడంతో గాయపడ్డాడు. దీంతో సంజన ఫిర్యాదు మేరకు బిల్డర్లు ఉపేందర్‌రెడ్డి, సూర్య, రాహుల్‌తో పాటు మరికొంత మందిపై, అలాగే సూపర్‌వైజర్‌ను చెప్పుతో కొట్టినందుకు సంజనతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇరువర్గాలను గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు



సీమంతంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు



పౌష్టికాహార వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ పాత గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వారికి సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అధికారులు ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.